క్లుప్తంగా

ఘనంగా బోనాల ఉత్సవం



బోనాల ఉత్సవంలో పాల్గొన్న గోదావరి

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలో గురువారం పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు ఉదయం నుంచి అమ్మవారికి పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. బీజేపీ మహిళా జిల్లా అధ్యక్షురాలు గోదావరి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి కృపతో ప్రజలు సంతోషంగా ఉండాలని మొక్కుకున్నారు. సోలక్‌పల్లి గ్రామంలోనూ బోనాల ఉత్సవం నిర్వహించారు.

ఘనంగా బోనాల ఊరేగింపు

సదాశివపేట(సంగారెడ్డి): కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా గురువారం భక్తి శ్రద్ధలతో మహిళలు బోనాల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజు విన్యాసాలతో యువకులు నృత్యాలు చేస్తూ దుర్గమ్మ మందిరానికి చేరుకొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. కుమ్మరి సంఘం సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

జోగిపేటలో..

జోగిపేట(అందోల్): ఆషాఢం మాసాన్ని పురస్కరించుకొని గురువారం జోగిపేటలోని శివాజీ నగర్ కాలనీలో బోనాల పండగను వైభవంగా నిర్వహించారు. కౌన్సిలర్ కొరబోయిన నాగరాజ్ (నాని) ముదిరాజ్, వులువల సత్తయ్య, వులువల రమేష్, నర్ర భీమ్ రాజ్, వులువల శివకుమార్, బందిగి శ్రీనివాస్ ,నర్ర సురేష్, అల్లె రాకేష్, వు రవీందర్, ఉలువల పరుశురాం, మహేందర్ పాల్గొన్నారు.

హామీల అమలు చేయకుంటే ఉద్యమిస్తాం

పటాన్‌చెరు టౌన్: కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ఉద్యమిస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు వీరేశం అన్నారు. గురువారం పటాన్‌చెరు మండలం బచ్చుగూడెం చౌరస్తా సమీపంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ మండల శాఖ సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు అల్లం రాజారెడ్డి, జిల్లా నాయకుడు ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి సాయి ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ధనుంజయ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం



దరఖాస్తులను స్వీకరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

నారాయణఖేడ్: రైతుబీమా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని గురువారం నారాయణఖేడ్ వ్యవసాయ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి శంకర్ మాట్లాడుతూ జూన్ 28 వరకు భూములను రిజిస్ట్రేషన్ చేసుకొని, 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సుగల వారు ఆగస్టు 4 లోగా తమ గ్రామాల్లోని ఏఈఓలకు దరఖాస్తులు అందజేయాలన్నారు. దరఖాస్తుతోపాటు పట్టాదార్ పాసుపుస్తకం, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ అందజేయాలని సూచించారు. బీమా సౌకర్యం కలిగిన రైతులు ఏదైన సవరణ చేసుకోవాలనుకుంటే ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దారులన్నీ గుంతలమయం

- ప్రయాణం బిక్కుబిక్కు
- వాహనదారులకు తప్పని తిప్పలు
- కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ ఛిద్రం

హత్నూర (సంగారెడ్డి): రహదారులన్నీ అధ్వానంగా మారాయి. కురుస్తున్న వర్షాలకు భారీగా గోతులు ఏర్పడ్డాయి. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు. మండల కేంద్రమైన హత్నూర నుంచి జోగిపేటకు వెళ్లే ప్రధాన రహదారి గుంతల మయంగా మారింది. అలాగే హత్నూర సమీపంలోనూ భారీ గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డుపై ప్రయాణం చేయాలంటేనే జంకుతున్నారు. కొందరు ప్రమాదాల బారిన పడుతున్నా అధికారుల్లో చలనం రావడంలేదని స్థానికులు చెబుతున్నారు. కొన్యాల వెళ్లే ప్రధాన రహదారి సైతం అధ్వానంగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

నాగుల్దేవులపల్లి వెళ్లే రోడ్డు సైతం..

దౌల్తాబాద్ నుంచి నాగుల్దేవులపల్లి వెళ్లే ప్రధాన రహదారి సైతం గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. హత్నూర నుంచి నవాబుపేట వెళ్లే రహదారి సైతం పూర్తిగా ధ్వంసమైంది. ఇలా మండలంలోని అన్ని గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. మల్కాపూర్ నుంచి పటాన్‌చెరు వెళ్లే ప్రధాన రహదారిపై వెళ్లాలంటేనే గుబులు పుడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



హత్నూర నుంచి జోగిపేట వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు

బైక్ పై వెళ్లాలంటే భయమే..



హత్నూర నుంచి సిరిపురం వరకు బైక్‌పై వెళ్లాలంటే గుబులు పుడుతోంది. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయంగా ఉంది. మూడు నెలల క్రితమే రోడ్డు మరమ్మతులు చేశారు. నాణ్యత పాటించకపోవడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు చర్యలుచేపట్టాలి.
– ప్రవీణ్ గౌడ్, హత్నూర

మరమ్మతులు చేపట్టండి



ప్రధాన రహదారులన్నీ అధ్వానంగా మారాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలి. నిర్లక్ష్యం చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రాత్రి వేళ బైక్‌పై వెళ్తున్నవారు ప్రమాదాల బారిన పడుతున్నారు.
– ధనుంజయ, హత్నూర

పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలి



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఎంపీడీఓ సుధాకర్

ఝరాసంగం(జహీరాబాద్): గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎంపీడీఓ సుధాకర్ సూచించారు. గురువారం మండల పరిధిలోని పొట్టిపల్లి గ్రామాన్ని ఆయన సందర్శించి, కొనసాగుతున్న పనులను పరిశీలించారు. అదే విధంగా వన మహోత్సవంలో భాగంగా ఇంటి ఆవరణలో నాటుకునేందుకు మొక్కలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నాగరాజు పాటిల్, శంశోద్దిన్, కార్యదర్శి అనిల్‌కుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మ, నిర్మల పాల్గొన్నారు.

మెట్రో విస్తరణకు బడ్జెట్‌లో నిధులు

హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు మెట్రోరైలు పొడిగిస్తామని సీఎం రేవంత్ ప్రకటించిన విషయం తెలిసిందే. హామీ మేరకు బడ్జెట్‌లో నిధులు కేటాయించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మార్చి నెలలో జాతీయ రహదారిపై మెట్రోరైలు వంతెన నిర్మాణం కోసం భూసార పరీక్షలు నిర్వహించారు. పారిశ్రామిక ప్రాంతమైన రామచంద్రాపురం, పటాన్‌చెరు, ఇస్నాపూర్ ప్రాంతల నుంచి నిత్యం వేలాది మంది కార్మికులు, విద్యార్థులు, ఉద్యోగస్తులు నగర ప్రాంతానికి రాకపోకలు సాగిస్తుంటారు. బస్సులు, వాహనాల్లో ప్రయాణం చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యతో పాటు గమ్య స్థానానికి చేరుకోవడం ఆలస్యమవుతుంది. అదే మెట్రోరైలు అందుబాటులోకి వస్తే ఆ సమస్య ఉండదని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వం వెంటనే మెట్రోరైలు పనులను ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

మెట్రో ఆవశ్యకత ఉంది



పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలకు మెట్రో అవసరం ఎంతైనా ఉంది. నిత్యం నగరానికి అనేకమంది రాకపోకలు సాగిస్తుంటారు. ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. మెట్రో అందుబాటులోకి వస్తే చాలా ఉపయోగకరంగా ఉంటుంది.
– నాలకంటి యాదగిరి యాదవ్, మాజీ ఎంపీపీ, రామచంద్రాపురం

త్వరగా పనులు ప్రారంభించాలి



మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు మెట్రో రైలు పొడిగింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించడం ఆనందంగా ఉంది. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని మెట్రో పనులు త్వరగా చేపట్టి పూర్తి చేయాలి. – నాగరాజు యాదవ్, పటాన్‌చెరు,

ట్రాఫిక్ సమస్య ఉండదు



మెట్రోరైలు రాకతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది. మెట్రోలో సకాలంలో గమ్య స్థానానికి చేరుకోవచ్చు. ట్రాఫిక్ సమస్య ఉండదు.
– అంజిత్, విద్యార్థి, రామచంద్రాపురం

కేంద్రం బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం



మాట్లాడుతున్న ఎంపీ సురేష్ షెట్కార్

నారాయణఖేడ్: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ పేర్కొన్నారు. గురువారం ఆయన ఢిల్లీ నుంచి స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఇది కుర్చీ బచావో బడ్జెట్‌గా ఉందని విమర్శించారు. ప్రభుత్వాన్ని నిలుపుకోవడానికి బిహార్, ఆంధ్రప్రదేశ్‌లకు తాయిలాలు ఇచ్చిందన్నారు. ఈ విధానాలు గమనిస్తే బీజేపీ క్విడ్‌ప్రోక్రో వ్యవస్థను నడుపుతున్నట్లు ఉందన్నారు. విభజన సందర్భంగా ఇచ్చిన హామీల అమలుకు కూడా ప్రాధాన్యతను ఇవ్వలేదన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం చేశాయన్నారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఓవర్‌హాల్ యూనిట్, నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఇక్కడి ప్రాజెక్టులకు జాతీయ హోదా గురించి బీజేపీ పట్టించుకోవడం లేదన్నారు. దీనికి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీజేపీ ఎంపీలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాగా అంతకుముందు ఢిల్లీలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో సురేశ్ షెట్కార్ పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన ఇంటిగోడ



బాగారెడ్డిపల్లిలో కూలిన ఇంటి గోడ

జహీరాబాద్: పట్టణంలోని బాగారెడ్డిపల్లి కాలనీలో గౌరమ్మకు చెందిన ఇంటిగోడ కూలింది. గురువారం మధ్యాహ్నం గోడకూలినట్లు బాధితురాలు పేర్కొంది. వారం రోజులుగా కూలుతున్న వర్షాలకు కూలిపోవడంతో బాధితులు ఆందోళనకు గురయ్యారు. పరిహారం అందించి ఆదుకోవాలని అధికారులను కోరారు.

108 సిబ్బందికి ఉత్తమ సేవా పురస్కారం

పటాన్‌చెరు: పటాన్‌చెరు పరిధిలో 108లో మెడికల్ టెక్నిషియన్, పైలెట్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు ఉత్తమ పురస్కారం అందుకున్నారు. గత మూడు నెలల్లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు అవార్డులను అందజేశారు. పటాన్‌చెరుకు చెందిన 108 మెడికల్ టెక్నిషియన్ ప్రశాంత్, పైలెట్ పండరికి హైదరాబాద్‌లోని 108 సంస్థ ప్రధాన కార్యాలయంలో లైఫ్ సేవియర్ అవార్డును అందజేశారు.

ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ

వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లి మండలం లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు, డిస్ట్రిక్ క్యాబినేట్ కార్యదర్శి రమేశ్‌జ్యోషి దంపతుల పెళ్లిరోజు సందర్భంగా గురువారం మండలంలోని నాగులపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ డిస్ట్రిక్ క్యాబినేట్ సెక్రెటరీ పెద్దన్న మాట్లాడుతూ సామాజిక సేవే లక్ష్యంగా లయన్స్‌క్లబ్ ముందుకు వెళ్తుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కిషన్‌రావు, కోశాధికారి సిద్దేశ్వర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చంద్రరెడ్డి, మల్లేశం పాల్గొన్నారు.

నల్లవాగుకు స్వల్ప ఇన్‌ఫ్లో

కల్హేర్(నారాయణఖేడ్): జిల్లాలోని మధ్య తరహా ప్రాజెక్టు నల్లవాగులో గురువారం స్వల్ప నీటి మట్టం పెరిగింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1,493 ఫీట్లు కాగా ప్రాజెక్టు ఎగువ భాగంలో కురిసిన ముసురుతో కొద్దిగా ఇన్ ఫ్లో వచ్చి చేరుతుంది. మూడు ఫీట్ల వరకు నీటిమట్టం పెరిగింది. ప్రస్తుతం 1,482 ఫీట్ల వరకు నీటి నిల్వ ఉంది. భారీ వర్షాలు కురిస్తే 11 ఫీట్ల వరకు నీరు చేరాల్సి ఉంది. ప్రాజెక్టు నిండితే పంటలు బాగా పండుతాయని రైతన్నలు ఆశగా ఎదురుచూస్తున్నారు.



సైబర్ నేరాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఏఎస్ఐ అక్బర్ అలీ

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు సైబర్ నేరాలతో పాటు షీటీం సేవలపై అవగాహన కలిగి ఉండాలని పటాన్‌చెరు ఏఎస్ఐ అక్బర్ అలీ అన్నారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో గురువారం మండలంలోని పెద్దకంజర్ల జెడ్పీహెచ్ఎస్, అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు బాలల హక్కులు, షీటీం, పోక్సో చట్టం, బాల్య వివాహాలు, లింగ సమానత్వం, వివక్షత, సఖి సర్వీసెస్, చైల్డ్‌లైన్ సేవలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. షీటీం హెడ్ కానిస్టేబుల్ శివకుమార్, పంచాయతీ సెక్రటరీ అనిత, హెచ్ఎం విద్యాసాగర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వీడని వర్షం.. పంటలకు నష్టం !



రాయికోడ్ శివారులో పెసర పంట సాగు

రాయికోడ్(అందోల్): వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా పంటలకు నష్టం వాటిల్లుతోంది. వర్షంతో వ్యవసాయ పనులు నిలిచిపోగా.. జనం ఇళ్లకే పరిమితం అయ్యారు. పత్తి, పెసర, జొన్న తదితర పంటలకు నష్టం కలిగే అవకాశాలు ఉన్నాయి. ఆయా పంటలకు తెగుళ్లు సోకి రైతులకు పెట్టుబడి ఖర్చులు పెరగనున్నాయి. ఇప్పటికే పత్తి మొక్కల వేర్లకు పలు రకాల తెగుళ్లు సోకినట్లు వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. మరో మూడ్రోజుల పాటు వర్షాలు కురుస్తాయనే ప్రకటనతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాల్లో వర్షపు నీరు నిలవకుండా బయటకు పంపించి తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టడంపై దృష్టి సారించాలని అధికారులు రైతాంగానికి సూచించారు.

మూలమలుపుల వద్ద కొమ్మలు తొలగింపు



మూలమలుపు వద్ద పనులు చేయిస్తున్న ఎస్ఐ తదితరులు

ఝరాసంగం(జహీరాబాద్): మండల కేంద్రమైన ఝరాసంగం నుంచి జహీరాబాద్ వెళ్లే ప్రధాన రహదారి మూలమలుపుల వద్ద ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. గురువారం ఎస్ఐ టీ.నరేశ్ సిబ్బందితో కలిసి కుప్పానగర్ సమీపంలోని మూలమలుపుల వద్ద జేసీబీ సహాయంతో చెట్ల కొమ్మలతో పాటు పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను తొలగించారు. ప్రధాన రహదారి మూలమలుపుల వద్ద ఉన్న దట్టమైన పొదలతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. దీంతో పోలీసులు ప్రమాదాల నివారణకు అడ్డుగా ఉన్న పొదలు, చెట్ల కొమ్మలను తొలగించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రవి, రమేష్, సత్యనారాయణ, నాయకులు రవి, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్: గ్రామీణ ప్రాంత యువకులకు స్వయం ఉపాధి కల్పనలో భాగంగా ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి కల్పన శిక్షణా కేంద్రం డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిఉండి 18 నుంచి 45 ఏళ్ల వయసు కలిగినవారు అర్హులని చెప్పారు. పూర్తి సర్టిఫికెట్లతో పట్టణంలోని స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రంలో హాజరు కావాలన్నారు. ఆగస్టు 5 నుంచి నెల రోజులపాటు శిక్షణతో పాటు ఉచిత వసతి, భోజనం సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మెదక్, సంగారెడ్డి జిల్లా వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9490103390, 9490129839 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పూర్తి నష్టపరిహారం చెల్లించాలి

సంగారెడ్డి టౌన్ : పవర్ గ్రిడ్ కార్పొరేషన్ నిర్మిస్తున్న బీదర్ మహేశ్వరం 765 కేవీ పవర్ ట్రాన్స్‌మిషన్ లైన్‌లో భూములు కోల్పోతున్న రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ మెంబర్ సత్యనారాయణరెడ్డి కోరారు. గురువారం కలెక్టరేట్‌లో డీఆర్ఓ పద్మజారాణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగల్‌గిద్ద, మనూరు, నాల్కల్, రాయికోడ్, ఝరాసంగం మండలాల మీదుగా జరుగుతున్న టవర్ల నిర్మాణానికి రైతులు ఒక్కొక్కరు 12 గంటల భూమి కోల్పోతున్నారని తెలిపారు. మార్కెట్ విలువను బట్టి నష్టపరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు

నారాయణఖేడ్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్‌షిప్స్, రియింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని కోరుతూ బీజేవైఎం రాష్ట్ర కమిటీ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది. దీంతో గురువారం తెల్లవారుజామున పోలీసులు ముందస్తుగా ఖేడ్‌లో బీజేవైఎం కార్యకర్తలను అరెస్టు చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ తప్పులను సవరించుకోవాలి

మునిపల్లి(అందోల్): రైతుబీమా చేయించుకున్న రైతులు నామిని పేరు, ఇతర తప్పులుంటే సరిచేయించుకోవడానికి ఈనెల 30 తేదీ వరకు అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి శివకుమార్ గురువారం తెలిపారు.

◆ బీజేపీని బలోపేతం చేయాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): బీజేపీ మండల కార్యవర్గ సమావేశాన్ని గురువారం పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి ఎల్లయ్య పాల్గొని మాట్లాడారు. పార్టీని మండలంలోని ప్రతి గ్రామానికి తీసుకెళ్లి బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే మండలంలోని రెవెన్యూ సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో విఫలం చెందిందని ఆరోపించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

◆ రాష్ట్ర బడ్జెట్ ఆమోదకరం

నారాయణఖేడ్: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా ఆమోదకరమైనదని కాంగ్రెస్ గిరిజన విభాగం రాష్ట్ర నాయకులు ప్రకాష్‌రాథోడ్ అన్నారు. గురువారం ఖేడ్‌లో ఆయన మాట్లాడుతూ కేంద్రం రాష్ట్రానికి మొండిచేయి చూపినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు ఉపయోగపడేలా బడ్జెట్‌ను రూపొందించిందన్నారు. ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఖేడ్ నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు.

◆ హుండీ చోరీ..

పటాన్‌చెరు టౌన్ : దుర్గామాత దేవాలయంలో హుండీని ఎత్తుకెళ్లిన ఘటన భానూర్ – బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామంలో బుధవారం అర్ధరాత్రి నలుగురు దుండగులు అమ్మవారి దేవస్థానంలో హుండీని ఎత్తుకెళ్లారు. చుట్టు పక్కల సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు స్కూటీ, బైక్ పై మొత్తం నలుగురు వచ్చినట్లు గుర్తించారు. ఆ స్కూటీని ముందుగా పటాన్‌చెరు మండలం కర్దనూర్ గ్రామం నుంచి ఎత్తుకొచ్చినట్లుగా తెలుస్తుందన్నారు. ఆలయంలో పూజలు నిర్వహించే లక్ష్మయ్య గౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

◆ రుణాలు ఇవ్వాలని వినతి

నారాయణఖేడ్: ఎస్టీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి కోసం రాయితీ రుణాలు అందించాలని గురువారం ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్‌ను హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో బంజారా సేవాలాల్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్ వినతిపత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వం రుణానికి బ్యాంకు కాన్సెంట్ ఇచ్చి పీడీ అకౌంట్ కింద పెండింగ్‌లో పెట్టిందని వివరించారు. ఎనిమిదేళ్లుగా రాయితీ రుణాలు అందక నిరుద్యోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వివరించారు. ఆయన వెంట నాయకులు రాజునాయక్, రవీందర్ ఉన్నారు.

◆ కూలిన ట్రాన్స్‌ఫార్మర్

జహీరాబాద్: మండలంలోని శేఖాపూర్ గ్రామంలో చిన్న చెరువు వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నేల వాలింది. వర్షం, గాలి వీయడం వల్ల ఒక పక్కకు ఒరిగిపోయినట్లు రైతులు పేర్కొన్నారు. దీంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వారం రోజులుగా కురుస్తున్న చిరు జల్లుల కారణంగా భూమి మెత్తబడడంతో ట్రాన్స్‌ఫార్మర్ పక్కకు ఒరిగిపోయింది.

◆ 27న స్పాట్ అడ్మిషన్లు

హత్నూర(సంగారెడ్డి): హత్నూరలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల్లో ఈనెల 27న మిగిలివున్న ఖాళీల భర్తీకోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ భిక్షమయ్య గురువారం తెలిపారు. శనివారం ఉదయం 9గంటల నుంచి అడ్మిషన్లు ప్రారంభిస్తామని, పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు హాజరు కావాలని సూచించారు.

◆ గీత కార్మికులకు బడ్జెట్ పెంచాలి

సంగారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గీత కార్మికుల సంక్షేమానికి మరింత బడ్జెట్ కేటాయించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్, కార్యదర్శి రమేశ్‌గౌడ్ అన్నారు. కార్మికుల సంక్షేమానికి రు.68 కోట్లు, నీరాకు రూ.25కోట్లు మాత్రమే కేటాయించారని సేఫ్టీమోకులు, రుణాలు తదితర సంక్షేమం కోసం తగిన బడ్జెట్ కేటాయించాలని కోరారు.

◆ మెరుగైన విద్య అందించాలి

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్ సూచించారు. శివానగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం ఆయన యూనిఫాంలు, నోటుపుస్తకాలు అందించారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, వడ్డె కృష్ణ, రాజుగౌడ్, మహేష్, సంతోష పాల్గొన్నారు.

◆ ఆనెగుంటలో వైద్య శిబిరం

జహీరాబాద్: వైరల్ జ్వరాలు వస్తుండటంతో మండలంలోని ఆనెగుంటలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. గురువారం మల్‌చల్మ పీహెచ్‌సీ వైద్యులు మధులత ఆధ్వర్యంలో మందులను అందజేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆమె సూచించారు. ముస్తఫా, హీరాబాయి, గీతాబాయి, సంగీతబాయి, సమదాన, మాజీ ఎంపీటీసీ నాగిశెట్టి, మండల కో ఆప్షన్ మాజీ సభ్యుడు మొయినొద్దీన్ పాల్గొన్నారు.